క్లుప్తంగా

యూత్ రెడ్‌క్రాస్ ట్రైనింగ్ విద్యార్థులకు అభినందనలు

జడ్చర్ల టౌన్: చండీఘర్ కురుక్షేత్రలో జరిగిన ఆల్ ఇండియా యూత్‌రెడ్‌క్రాస్ ట్రైనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులను శుక్రవారం పట్టణంలోని బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అభినందించినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ తెలిపారు. రాష్ట్రం నుంచి మొత్తం పదిమంది విద్యార్థులు శిక్షణకు వెళ్లగా.. పట్టణంలోని డిగ్రీ కళాశాల నుంచి ఐదుగురు, మెదక్ జిల్లా నుంచి ఐదుగురు వెళ్లారన్నారు. శిక్షణ ముగించుకుని వచ్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులతోపాటు శిక్షణకు ఒక కోఆర్డినేటర్ వెళ్లారన్నారు. శిబిరంలో బీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చి మెడల్స్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు కనబర్చిన ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, వైఆర్‌సీ కోఆర్డినేటర్లు బాబుల్‌రెడ్డి, రాజేశ్వరి, ప్రవీణ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవాబుపేటలో వైద్యశిబిరం

నవాబుపేట: మండల కేంద్రంలో స్వస్థనారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్యనిపుణులు సొమ్య 129 మందికి ప్రత్యేక పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే 102 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం మహిళలకు చేపట్టిన ఈ వైద్యశిబిరాల్లో వారికి అన్నిరకాల పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన క్యాంపులో డాక్టర్ శ్రీజా, ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యనాయక్, శ్రీనివాస్, రాఘవేందర్, శరభలింగం, శ్రీనివాస్, జయశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆనంద్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బండి ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు నియామక పత్రాన్ని అందజేశారు. ఈయనతో పాటు జిల్లా బ్యాంకింగ్ సెక్టార్ కన్వీనర్‌గా అశోక్‌గౌడ్‌ను నియమించారు. ప్రైవేట్ ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శివప్రసాద్‌యాదవ్, ఉపాధ్యక్షుడు సంపత్, రాష్ట్ర మహిళ నాయకురాలు అనిత, నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్, సంతోష్, రజిని, కుమార్, సుధాకర్ అభినందనలు తెలిపారు.

కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ చాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, మహబూబ్‌నగర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు. పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను శుక్రవారం మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో ఈనెల 20, 21 తేదీల్లో రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఉంటుందని తెలిపారు. పోటీల్లో జిల్లా కేంద్రం నుంచి జుల్ఫికర్ 30కేజీల విభాగంలో, హఫ్సా 45కేజీలో, ఆయేషా 39కేజీలో, ఫహద్ 48కేజీలో, గుల్‌ఫిషా 447కేజీలో, మహ్మద్ అజహర్ 54కేజీలో, ఖిజ్ర 50కేజీలలో, హుజేష్ షరీఫ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు

భూత్పూర్: రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి మురళీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్మిషన్ ఆన్ అగ్రికల్చర్ మేకనైజేషన్ స్కీం ద్వారా 50శాతం రాయితీపై మానవ సహిత ఆపరేటర్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్, రోటీవేటర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయని, క్లస్టర్ పరిధిలోని ఏఈఓలను ఈనెల 24వ తేదీలోగా సంప్రదించాలని ఏఓ మురళీధర్ తెలిపారు.

బోయి భీమన్న జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో కళాప్రపూర్ణ పద్మ విభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. భీమన్న జీవితంలో సాహిత్యంతోపాటు వారి ఔన్నత్యాన్ని ప్రదర్శించే విధంగా చరన ఉటుందన్నారు. పాలేరు నాటకంతో ఆయన ఎంతో మంది జీవితాల్లో మార్పులు తీసుకొచ్చారని, యువతను ఉద్యోగాల వైపు నడిపించారని పేర్కొన్నారు. నేటితరం యువత భీమన్న రచనలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, కృష్ణమూర్తి, సుభాషిణి, రాఘవేంద్రరావు, స్వరూప, స్వప్న, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం తిర్మలాపురం ఊకచెట్టు వాగునుంచి గ్రామానికి చెందిన ఎండీ అనీశ్ శుక్రవారం అక్రమంగా ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తుండగా.. చిన్నచింతకుంట ఎస్‌ఐ ఓబుల్ రెడ్డి పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌకుంట్ల తహసీల్దార్ సుందర్‌రాజుకు అప్పగించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

నెరవేరిన దశాబ్దాల కల

- నేటినుంచి కావేరమ్మపేట పశువుల సంతలో గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు ప్రారంభం
- మున్సిపాలిటీకి ఆదాయం తెచ్చేందుకు యత్నాలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో శనివారం నుంచి గొర్రెలు, మేకలు క్రయవిక్రయాలు ప్రారంభించనున్నారు. పశువుల సంత నిర్వహించే స్థలంలోనే వీటి నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహించడంతోపాటు కరపత్రాలను విడుదల చేశారు. పదేళ్ల కిందటి వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జడ్చర్ల మేజర్ పంచాయతీలో ఉన్న కావేరమ్మపేట పశువుల సంతకు మంచి పేరు ఉండేది. కాలక్రమేణా పశువుల క్రయవిక్రయాలు పూర్తిగా తగ్గిపోయాయి. సంత ద్వారా రూ.లక్షల్లో ఆదాయం లభించేది. మున్సిపాలిటీగా మారిన తర్వాత పశువుల సంత నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. వేలంలో పాల్గొనేవారు లేక మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే సంత నిర్వహించాల్సి వస్తుంది. ఈ కారణంగా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం గండిపడింది. ఈ క్రమంలోనే రెండు దశాబ్దాలుగా గొర్రెలు, మేకల సంత నిర్వహించాలని కావేరమ్మపేటకు చెందిన ఆయా పార్టీల నాయకులు పట్టుబడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం నుంచి గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు ప్రారంభిస్తున్నారు. ముందుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సంత నిర్వహించాలని నిర్ణయించారు. రెండు, మూడు వారాల తర్వాత వేలం నిర్వహించాలనేది అధికారుల నిర్ణయం.

ఆదాయం పెంచేందుకే నిర్ణయం

మున్సిపాలిటీకి ఆదాయం పెంచేందుకే గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు ప్రారంభిస్తున్నాం. పశువుల క్రయవిక్రయాల సంఖ్య తగ్గడంతో ఆదాయం తగ్గింది. అందుకే గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకుల డిమాండ్ మేరకు సంతను ప్రారంభిస్తున్నాం. ముందుగా రెండు వారాలపాటు మున్సిపాలిటీ ఆధ్వర్యంలోనే నిర్వహించి తర్వాత వేలం వేస్తాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

నేటినుంచి విక్రయాలు

కావేరమ్మపేటలో శనివారం గొర్రెలు, మేకల క్రయ, విక్రయాలు ప్రారంభిస్తున్నాం. మున్సిపాలిటీకి ఆదాయంతోపాటు ఈ ప్రాంత ప్రజలకు మంచి గొర్రెలు, మేకలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లవుతుంది. ఇప్పుడైతే చాలామంది పెబ్బేరు, బిజినేపల్లి, మిడ్జిల్ వంటి ప్రాంతాల్లోని వారాంతపు సంతలకు వెళ్తున్నారు. కావేరమ్మపేటలో సంత ప్రారంభిస్తే ఆ సమస్య తీరుతుంది.

– పుష్పలత, చైర్‌పర్సన్, జడ్చర్ల మున్సిపాలిటీ

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన



చేనేత హస్త కళా ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న ప్రజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కళా సిల్క్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. వివిధ రాష్ట్రాల చేనేత కళాకారులు అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణలోని గద్వాల, నారాయణపేట, పోచంపల్లి, ఏపీలోని ధర్మవరం, వెంకటగిరి, మంగళగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాంలోని మూగ, ఎరిశిల్క్స్, బీహార్‌లోని బాగల్పూర శిల్క్స్, టస్సర్, చత్తీస్‌ఘడ్‌లోని ట్రిబిల్ వర్క్స్, కోసా శిల్క్, గుజరాత్‌లోని బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎంబ్రాయిడరీ శారీలు, డ్రెస్ మెటీరియల్స్, పాస్మిక్ శాల్, కర్నాటకలోని క్రేస్, ప్రింటెండ్ శారీస్, మధ్య ప్రదేశ్‌లోని చందేరి, మహేశ్వరి, రాజస్తాన్‌లోని కోటా, బందాని, బ్లాక్ ప్రింట్, సంగ్నరి ప్రింట్, ఉత్తరప్రదేశ్‌లోని జమ్దాని, బనారస్, లక్నో డ్రెస్ మెటీరియల్‌తోపాటు హర్యానా బెడ్ కవర్లు, కుషన్ కవర్లు, లక్నోవి కుర్తీస్, డోర్ కర్టెన్స్ తదితర రాష్ట్రాల హ్యాండీ క్రాఫ్ట్స్, న్యూట్రిషన్ ఫుడ్ విక్రయిస్తున్నారు. పట్టణ ప్రజలు ప్రదర్శనను వినియోగించుకొని చేనేత కళాకారులకు చేయూత అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

క్రమం తప్పకుండా పంపించాలి



మిడ్జిల్: విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు క్రమం తప్పకుండా కళాశాలకు వస్తే శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధిస్తారని పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాలతో మీ పిల్లలు ఎలా చదువుతున్నారో లెక్చరర్లు వివరిస్తారని, మరింత జాగ్రత్తలు తీసుకొని మీ పిల్లల భవిష్యత్‌కు మంచిమార్గం చూపించడానికి వీలు కలుగుతుందని అన్నారు. సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీయూలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ప్రారంభం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో లైబ్రరీ వద్ద ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–5 ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపును శుక్రవారం వీసీ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సమాజ సేవ చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ఒక చక్కటి అవకాశమని, సమాజంపై అవగాహన పెంచుకోవడం, సామాజిక రుగ్మతలు, పరిశుభ్రత తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేసేందుకు అవకాశం దొరుకుతుందన్నారు. లైబ్రరీ పరిసర ప్రంతాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా మార్చాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, ఛీఫ్ వార్డెన్ కృష్ణయ్య, ప్రోగ్రాం అధికారులు రాఘవేందర్, అర్జునకుమార్, శివకుమార్‌సింగ్, జ్ఞానేశ్వర్, పర్వతాలు, రవీందర్‌గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ దివస్ వారోత్సవాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దివస్ వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ.. మన దేశం బహుభాషా దేశమని, ఇక్కడ ఒకరికొకరు అభిప్రాయాలు పంచుకోవడానికి హిందీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధిపతి నర్సింహారావు కల్యాణి, అధ్యాపకులు నాగలక్ష్మి, వీరప్రతాప్, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



పాలమూరు: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏడు శిబిరాలు ఏర్పాటు చేసి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. హన్వాడ, రామయ్యబౌళి, నవాబ్‌పేట, సీసీకుంట, భూత్పూర్, మహ్మదాబాద్, మోతీనగర్‌లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయడం జరిగింది. రామయ్యబౌళి అర్బన్ హెల్త్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సందర్శించారు. కొనసాగుతున్న పరీక్షల విధానాన్ని పరిశీలించారు.

జనరల్ ఆస్పత్రిలో కీమోథెరపీ సేవలు

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఇటీవల ప్రారంభించిన క్యాన్సర్ వార్డులో శుక్రవారం ఇద్దరూ రోగులకు విజయవంతంగా కీమోథెరపీ చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగాఅజ్మీరా రోగులకు కావాల్సిన మందులు పంపిణీ చేశారు. జనరల్ ఆస్పత్రిలో ఉచితంగా కీమోథెరపీ సేవలు అందుబాటులోకి రావడంతో పేదరోగులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. క్యాన్సర్ క్లినిక్‌లో 24గంటల పాటు సేవలు అందుబాటులో ఉంటాయని ఈ సేవలను కావాల్సిన క్యాన్సర్ బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సునీల్, అమరావతి, బాల శ్రీనివాస్, స్వప్న, ఎంఎన్‌జె క్యాన్సర్ ఆస్పత్రి వైద్యుడు గౌస్ ఇతర టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతన బడ్జెట్ విడుదల చేయాలి

జడ్చర్ల టౌన్: వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్ కార్మికుల వేతనాలకు సంబంధించిన ఆరునెలల పెండింగ్ బడ్జెట్ తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్య సమన్వయ అధికారి సుకన్యకు కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి దసరా, బతుకమ్మ సంబరాలు వైభవంగా చేసుకునేలా చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నర్సింహ, నవీన్, అంజి, పేర్మల్, రామకృష్ణ, మణెమ్మ, శివలీల, పద్మ, అలివేలమ్మ, భార్గవి, అంజలి, మంగమ్మ పాల్గొన్నారు.

హంస క్వింటా రూ.1,752

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం హంస ధాన్యం, ఆముదాలకు టెండర్లను చేపట్టారు. మార్కెట్ యార్డులో జరిగిన టెండర్లలో హంస ధాన్యానికి క్వింటాకు రూ.1752 ధర లభించింది. కత్తెర పంట కింద సాగు చేసిన వరి ధాన్యం మార్కెట్‌కు రావడంతో వేలం పాట నిర్వహించారు. సుమారు 72 క్వింటాళ్ల ధాన్యం మార్కెట్‌కు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆముదాలకు నిర్వహించిన టెండర్లలో కింటాకు అత్యధికంగా రూ.5,654 ధర లభించింది. సుమారు 20క్వింటాళ్ల ఆముదం మార్కెట్‌కు వచ్చింది.

మహిళల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకే..

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వస్తినారి స్వసక్తి పరివార అభియాన్‌లో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఈఎన్‌టీ వైద్యుడు రామకృష్ణ 120 మంది మహిళలకు చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. 20మంది మహిళలకు సమస్య ఉందని గుర్తించి జిల్లా ఆస్పత్రిలో సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా కృషి చేస్తుందన్నారు. ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్‌కు గిరిజన నాయకులు



నవాబుపేట: రాజ్‌గోండులను వెంటనే ఎస్టీ జాబితాల నుంచి తొలగించాలని లంబాడి హక్కుల పోరాట సమితీ, లంబాడి సంఘాల ఐక్యవేదిక చేపట్టిన ఆందోళనలో పాల్గొనేందుకు శుక్రవారం మండల గిరిజన నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు సంతోష్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి చందర్‌నాయక్ ఆధ్వర్యంలో లంబాడి నేతలు వందల సంఖ్యలో తరలివెళ్లారు. లంబాడీల రిజర్వేషన్లు ఎత్తివేయాలని కోర్టుల్లో కేసులు వేసి గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నా తెల్లం వెంకట్రావ్, సోయం బాపురావును వెంటనే కాంగ్రెస్ నుంచి బహిష్కరించాలన్నారు. హైదరాబాద్ తరలిన వారిలో లంబాడి సంఘాల ఐక్యవేదిక నాయకులు శంకర్‌నాయక్, లింబ్యానాయక్, తులసీరాంనాయక్, రాజునాయక్, గోపాల్, సేవాలాల్ సేనా రాష్ట్ర నాయకుడు హరినాయక్, మంగేష్, నర్సింహ, భగవాన్‌నాయక్, భాస్కర్, రవి, రాజు, ప్రకాశ్, లక్ష్మన్, వినోద్ తదితరులు ఉన్నారు.

ఉన్నత స్థానాలకు ఎదగాలి

దేవరకద్ర రూరల్: జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్‌ఐ నాగన్న సూచించారు. చౌదర్‌పల్లి స్టేజ్ దగ్గర ఉన్న ఎస్‌సీ గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉంటూ తల్లితండ్రుల కలలు నిజం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది, పాలొన్నారు.

ఎంబీఏలో డ్యుయెల్ స్పెషలైజేషన్ కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలోని ఎంబీఏలో స్పెషలైజేషన్ కల్పించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు రిజిస్ట్రార్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఏబీవీపీ నాయకులు ప్రస్తుత ఎంబీఏ విద్యార్థులకు ఒకే స్పెషలైజేషన్ అవకాశం మాత్రమే ఉందని, పోటీ ప్రధానమైన ఈ కాలంలో ఒకేసారి రెండు స్పెషలైజేషన్‌లు చేయగలగడం ద్వారా విద్యార్థులకు ఎక్కువ స్కిల్స్ పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాను, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సర్వీస్‌రూల్స్‌లో ఉన్న సమస్యలు తొలగించి రెగ్యులర్ ఎంఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీచేయాలన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాహెర్, సంఘం బాధ్యులు శేఖర్, శరణప్ప మల్లికార్జున్, షహీనాపర్వీన్, మల్లయ్య, నార్యానాయక్, శ్రీనివాసులు, ఆంజనేయులు, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎంఈడీ విద్యార్థుల వీడ్కోలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో ఎంఈడీ విభాగం విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి వీసీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ఎంతో ఉన్నతమైందని, దాన్ని విద్యార్థులకు గౌరవప్రదంగా భావించి విధులు నిర్వహించాలన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, డీన్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, బషీర్ అహ్మద్, విశ్వనాథ్, జయనాయక్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

జడ్చర్ల: విద్యార్థుల చదువుకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేశ్‌తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సిగ్నల్‌గడ్డ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నరేశ్‌తేజ మాట్లాడుతూ.. పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సదుసద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ప్రభుత్వం నీరుగారుస్తుందని ఆరోపించారు. సకాలంలో నిధులను విడుదల చేయక పోవడంతో విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.8500 కోట్లు బకాయిలు పేరుకుపోయావన్నారు. ఈ కారణంగా విద్యార్థుల చదువులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని, సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో పైచదువులకు వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యశ్వంత్, అశోక్, పాండు, విజయ్, దివ్య, మైత్రి, మహేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శిపై దాడి: ఠాణాలో ఫిర్యాదు



కంచన్‌పల్లి జీపీ వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

మహమ్మదాబాద్: జీపీ కార్యదర్శితో దూషణకు దిగి ఆయనపై దాడిచేసిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన చోటుచేసుకున్నది. మండలంలోని కంచన్‌పల్లి కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం జీపీ కార్యాలయం వద్ద ఉండగా.. అదే గ్రామానికి చెందిన అక్బర్ ఇందిరమ్మ ఇళ్లకు సమయానికి బిల్లులు ఎందుకు ఇవ్వడంలేదని.. ఆలస్యం ఎందుకు చేస్తున్నావని అడిగాడు. అక్కడికే ఆగకుండా విధులు సరిగ్గా నిర్వహించడంలేదని.. నీ ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకునేదిలేదని తీవ్ర పదజాలంతో దూషించాడు. ప్రభుత్వం మాది ఉన్నా.. మాకు సమాచారం ఇవ్వకుండా నీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నావంటూ మండిపడ్డాడు. ఉన్నతాధికారుల సూచనలు, సలహాల మేరకు వెళ్తున్నామని జీపీ కార్యదర్శి తెలిపినా వినకుండా ఆయనపై చేయిచేసుకోబోయాడు. పోలీసులు గ్రామంలోకి వచ్చి విచారణ చేసుకుని వెళ్లిపోయారు.

ప్రజలకు న్యాయం చేయమన్నా..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అందరికీ చేరేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపాను. కాని ఆయనపై ఎలాంటి దూషణ చేయలేదు, చేయి చేసుకోలేదు. పథకాల వర్తింపులో డబ్బులు తీసుకున్నట్లు నాకు గ్రామస్తులు చెప్పారు. లోన్లు ఇప్పిస్తానని ఎంతోమందికి ఆశపెడుతూ ఇబ్బందులు పెడుతున్నావని ప్రజలకు అన్యాయం చేయొద్దని తెలిపాను. నేను ఆర్మీలో పనిచేశాను.. అన్యాయాన్ని సహించను.

– అక్బర్ కంచన్‌పల్లి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సామాజిక సేవకురాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరండా ఉండాలని సామాజిక సేవకురాలు సోనియారాణి అన్నారు. జిల్లా కేంద్రంలో ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను వాడటంతో ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు జరిగే కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు పాల్గొనాలని కోరారు. రూరల్ ఎస్‌ఐ మహేందర్ మాదకద్రవ్యాల దుష్పరిణామాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు

రాజాపూర్: మత్తుపదార్థాలతో యువత తమ బంగారు భవిష్యత్‌ను చెడు వ్యసనాలకు అలవాటుపడి పాడు చేసుకోవద్దని ఎస్‌ఐ శివానందంగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నతపాఠశాలలో పోలీసు కళాజాత ఆధ్వర్యంలో ప్రజాభద్రత.. పోలీసు బాధ్యత అనే సామాజిక కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ విలువలతో కూడిన జీవనం గడపాలన్నారు. సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు, మెసేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. గంజాయిరహిత జిల్లాగా చేయాలన్నదే ఎస్పీ లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. మత్తుపదార్థాల తయారీ సరఫరా, రవాణా సమాచారం తెలిస్తే 8712659360 నెంబర్‌కు మామాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ, టీమ్, షీటీమ్ సురక్ష పోలీస్ కళాబృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లోనే పౌష్టికాహారం



పోషక పదార్థాలు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నవాబుపేట: మన ఇంటి పరిసరాల్లోనే పౌష్టికాహారం ఉన్నా.. మనం వాటిని పట్టించుకోకుండా వ్యాపార ప్రకటనలు చూసి వాటిని వాడుతామని దీన్ని తగ్గించాలని ఎంపీడీఓ జయరాంనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పోషకాభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలకు సరఫరా అవుతున్న వాటితో పౌష్టికాహారం, మన ఇంటి పరిసరాల్లో లభించే ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలు వండి ప్రదర్శనగా ఉంచారు. వాటి వల్ల ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధికారులతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది సరస్వతీ, ప్రమీళ, అనుసూయ, ఉమాదేవి, సునీత, విమల, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

మిడ్జిల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం ఉదయం 9గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో అన్నిరకాల రోగాలకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన అర్బన్‌స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలుర–2 విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆర్‌ఎల్‌సీ ఖాజా బాహుద్దీన్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్–17 ఖోఖోలు ఆరుగురు, అండర్–14 వాలీబాల్‌లో ఇద్దరు, అండర్–17 కబడ్డీలో ముగ్గురు మహబూబ్‌నగర్ అర్బన్ జట్లకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం గురుకులంలో అభినందించారు. జిల్లాస్థాయిలో ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పీఈటీలు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యం

రాజాపూర్: చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని క్రీడలతో మానసిక ఉల్లాసం కల్గుతుందని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్‌గౌడ్, తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, నాయకులు బచ్చిరెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాపూర్‌లో పోటీలను ప్రారంభిస్తున్న శశికళారెడ్డి

విద్యార్థులకు క్రీడలు అవసరం

నవాబుపేట: విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ అండర్–14, అండర్ 17 క్రీడలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో వివిధ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు క్రమశిక్షణ ప్రత్యేక నడవడిక నేర్పిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ నాగ్యనాయక్, పీఈటీ వినోద్, సీఆర్‌పీ జనార్దన్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షించినా నిరాశే..

నవాబుపేట: యూరియా వస్తుందన్న ఆశతో అన్నదాతలు రోజంతా పడిగాపులు కాసి నిరాశతో వెనుదిరిగారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద యూరియా వస్తుందని రైతులు వేచి చూశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళా రైతులు చాలా మంది రోజంతా రైతువేదిక వద్ద ఆశతో నిరీక్షించారు. తీరా యూరియా ఈరోజు రాదని తెలిసి గ్రామాలకు తిరుగుముఖం పట్టారు.



నవాబుపేట రైతువేదిక వద్ద యూరియా కోసం ఆశతో ఎదురుచూస్తున్న రైతులు